క్లుప్తంగా

'కాళేశ్వరం'పై కమిషన్ వేయడం అవివేకం

దుమ్ముగూడెం: సుప్రీంకోర్టు న్యాయమూర్తులే అవినీతి జరగలేదని, అంతా సవ్యంగానే ఉందని చెప్పినా కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ వేయటం అవివేకానికి నిదర్శనం అని బీఆర్ఎస్ లీగల్ అడ్వయిజర్ కొత్త మల్లేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వ విధానాన్ని ఖండించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవనాడిగా ఉందని ప్రాజెక్టుపై వేసిన కమిషన్‌ను తప్పుపట్టారు. ఎడారిగా అనేక దశాబ్దాలుగా ఉన్న తెలంగాణను జల సేలయేరులు పారించే విధంగా పాలన సాగించిన కేసీఆర్ పైన అడ్డగోలు కమిషన్ల పేరుతో ఆయన్ని అభాసు పాలు చేయాలని చూస్తే ఈ ప్రభుత్వమే ప్రజల ముందు దోషిగా నిలబడే రోజులు వస్తాయన్నారు.

వైభవంగా వెంకటేశ్వర కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): అన్నపురెడ్డిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ క్రతువు ఘనంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

టీపీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): అన్నపురెడ్డిపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు వనమా గాంధీ, దోసపాటి రాంబాబు, అచంట ఆంజనేయ, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆర్‌ఎంపీ కాసులకు పలువురు చేయూత అందించారు. ఈ మేరకు శనివారం మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు కాసులును పరామర్శించి అండగా ఉంటానని భరోసానిచ్చారు. అదేవిధంగా తోటి ఆర్‌ఎంపీలు రూ.16 వేలు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి రూ.3 వేలు ఆర్థికసాయం అందజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్

అశ్వాపురం: అశ్వాపురం తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రాజారావు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రాజారావుకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.

సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న రవికుమార్

ములకలపల్లి: వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని తెలంగాణా రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్ డిమాండ్ చేశారు. ములకలపల్లిలో రైతు సంఘ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాల విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని, అనుమతులులేని ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోపగాని లక్ష్మీనర్సయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, హేమానీ, వినోద్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నల్లమల గిరిప్రసాద్‌కు నివాళి..

దమ్మపేట : సీపీఐ నాయకులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు నల్లమల గిరి ప్రసాద్ వర్ధంతి దమ్మపేటలో పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిప్రసాద్ చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు సుంకు పాక ధర్మ, బత్తుల సాయి, సక్కా నాగమణి, స్వప్న, సౌందర్య తదితరులు ఉన్నారు.

పచ్చిరొట్టతో భూసారం పదిలం



పచ్చిరొట్ట పైరును కలియదున్నుతున్న రైతు (ఫైల్)

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

- జీలుగ, జనుము సాగుపై రైతుల ఆసక్తి
- అందుబాటులో సబ్సిడీ విత్తనాలు

చర్ల: పచ్చిరొట్ట సాగుపై ఏజెన్సీ రైతులు మక్కువ చూపుతున్నారు. పచ్చిరొట్ట భూమిలో సేంద్రియ కర్బనం, సేంద్రియ పదార్థాలను పెంపొందించి భూసారం కాపాడుతుంది. రసాయనిక ఎరువుల వాడకంతో సారం దెబ్బతినడంతో పాటు వాతావరణ కాలుష్యం ఏర్పడడం, సారవంతమైన భూములు నిస్సారంగా మారుతుండడంతో రైతులు పచ్చిరొట్ట ఎరువులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ మేరకు పంటల ఉత్పాదకతను పెంపొందించడానికి వ్యవసాయశాఖ అధికారులు ఏజెన్సీ రైతాంగానికి సలహాలు, సూచనలు చేస్తున్నారు.

అధికారుల సూచనలు..

మండలంలో సుమారు 17 వేల మంది రైతులు సుమారు 28 వేల ఎకరాల్లో వరి 12 వేల ఎకరాలు, పత్తి ఆరు వేల ఎకరాల్లో, మిర్చి 5 వేల ఎకరాల్లో సాగు చేస్తుండగా మిగిలిన 5 వేల ఎకరాల్లో మినుము, కంది, పెసర, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేస్తున్నారు. కాగా మండలంలో నీటి వసతి ఎక్కువగా ఉండడంతో రైతులు ఎక్కువ శాతం వరి పంటలను సాగు చేస్తున్నారు. వరి పంటను సాగు చేసే రైతులు తక్కువ ఖర్చుతో భూసారాన్ని ఎక్కువగా పెంచుకునేందుకు గానూ జనుము, జీలుగ సాగు చేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

సాగు విధానం.. ఉపయోగాలు..

వానాకాలం ఆరంభం కాగానే పొలంలో రైతులు ఎకరాకు 25 కిలోల చొప్పున జీలుగు విత్తనాలను 10 కిలోల యూరియాతో కలిపి పొలంలో జల్లిన తరువాత దుక్కి దున్నాలి. వర్షాభావ పరిస్థితులను బట్టి ఇది 30 నుంచి 40 రోజుల వ్యవధిలో ఏపుగా ఎదిగి పూత దశకు చేరుకుంటుంది. ఆ తరువాత జీలుగు పంటను కలియ దున్ని నీటిని పెట్టడంతో జీలుగు పంట కుళ్లి ఎరువుగా తయారవుతుంది. ఆ సమయంలో వరి నాట్లు వేసుకుంటే ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

- జీలుగు, జనుము పంటలకు కావాల్సిన బలాన్ని అందిస్తాయి. అదే విధంగా సాడు భూముల్లో సారం పెరుగుతుంది.
- ఎకరాలకు కేవలం 25 కిలోల జీలుగు విత్తనాలు చల్లడం ద్వారా వరి పంటకు సుమారు 3 టన్నుల ఎరువు లభిస్తుంది.
- పొలానికి సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.
- జీలుగు మొక్కలను భూమిలోకి దున్నడం వల్ల మొక్కలకు 27 శాతం నత్రజని, 53 శాతం భాస్వరం, 22 శాతం పొటాషియం అందిస్తాయి.
- సాధారణంగా 50 కిలోల యూరియా, 25 కిలోల డీఏపీ వాడకం వల్ల ఎంత లాభం కలుగుతుందో జీలుగు సాగు వల్ల అంత లాభం కలుగుడంతో ఖర్చు తగ్గుతుంది.

సబ్సిడీపై జీలుగు విత్తనాలు



రైతాంగానికి అవసరమైన జీలుగు విత్తనాలను సిద్ధం చేశాం. చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా 60 క్వింటాళ్లు, చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా 49 క్వింటాళ్లను రైతులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. 30 కిలోల బ్యాగు సబ్సిడీపై రూ 2,137.50 అందించేందుకు చర్యలు చేపట్టాం. త్వరలోనే ఈ విత్తనాల విక్రయాలు ప్రారంభిస్తాం.

– లావణ్య, మండల వ్యవసాయశాఖ అధికారి

రక్తం దానంచేస్తే ప్రాణదానం చేసినట్టే..



రక్తదానం చేస్తున్న న్యాయమూర్తి శివనాయక్, ఏఎస్పీ విక్రాంత్

భద్రాచలంఅర్బన్: రక్తం దానం చేస్తే మరో ముగ్గురికి ప్రాణదానం చేసినట్టేనని భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివనాయక్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. భద్రాచలం పట్టణంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నందు శనివారం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఇలాంటి శిబిరాలను నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్ని రక్తదానం చేయాలని కోరారు. అనంతరం ఐఆర్‌సీఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌ఎల్.కాంతారావు మాట్లాడుతూ.. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తలసేమియా, సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధిని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్‌కు ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేసేందుకు పూర్తి సహకారం అందిస్తున్నారని, దీంతో వ్యాధిగ్రస్తులకు ఉచితంగా రూ.4,000 విలువైన మందులు, రవాణాతో పాటు పౌష్టికాహారం కూడా అందుతుందన్నారు. సొసైటీ బాధ్యులు డా.చంద్రప్రసాద్, డా.భానుప్రసాద్, న్యాయవాది మాదిరెడ్డి రమణారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట దేవదానం, అడుసుమిల్లి జగదీష్, పల్లంటి దేశప్ప, సొసైటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది, మారుతి నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నమ్మకమైన పాలన

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



కరకగూడెం: సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

కరకగూడెం: కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధికి బాటలు పడుతున్నాయని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత సమత్ భట్టుపల్లి, రేగళ్ల, భట్టుపల్లి, కన్నాయిగూడెం పంచాయతీల్లో సుమారు రూ. 70లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం భట్టుపల్లి కేజీబీవీలో నూతనంగా నిర్మిస్తున్న డిగ్రీ కాలేజీ నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులు చేపట్టాలని లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. రానున్న రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి పోడు భూములకు పట్టాలు ఇస్తారని ఎవ్వరూ కూడా ఆందోళన చెందొద్దన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ కుమార్, మాజీ సర్పంచులు పోలెబోయిన తిరుపతయ్య, శ్రీవాణి, తోలెం నాగేశ్వరరావు, కుంజా వసంతరావు, నాయకులు ఎర్ర సురేష్, రాందాస్, అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలి..

పినపాక: విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తే వారి భవిష్యత్తుకు గట్టి పునాది పడుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో పినపాక, కరకగూడెం మండలాల్లోని ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని విద్యలో సమూల మార్పులు తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓలు కొమరం నాగయ్య, మంజుల పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- ఎమ్మెల్యే ఆదినారాయణ



అన్నపురెడ్డిపల్లి : సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జారె

దమ్మపేట : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా 25 మంది లబ్ధిదారులకు మొత్తంగా రూ.9,99,500ల విలువైన చెక్కులను అందజేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే..

చంద్రుగొండ : విద్యార్థుల భవిష్యత్ ఉపాధాయుల చేతుల్లోనే ఉంటుందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. మండలకేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చంద్రుగొండలోని రైతువేదికలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్యంపై ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటుందన్నారు.

అన్నపురెడ్డిపల్లిలో ...

అన్నపురెడ్డిపల్లిలో 13 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో అధికారులతోపాటు నాయకులు భోజ్యానాయక్, కిరణ్‌రెడ్డి, ఫజల్‌బక్ష్ పర్సా వెంకటేశ్వరరావు, వనమా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్‌ను నరికితే పీడీ యాక్ట్ కేసులు



ప్లాంటేషన్ ధ్వంసం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అశ్వాపురం: అటవీ శాఖ ఆధ్వర్యంలో వేసిన ప్లాంటేషన్‌ను నరికితే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని మణుగూరు ఫారెస్ట్ డివిజనల్ అధికారి సయ్యద్ మక్సూద్ అన్నారు. అశ్వాపురం రేంజ్ పరిధిలో తుమ్మల చెరువు బీట్‌లో స్థానిక గిరిజనులు ప్లాంటేషన్ ధ్వంసం చేసిన ప్రాంతాన్ని ఆయన శనివారం సందర్శించారు. ప్లాంటేషన్ ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్ఆర్ఓ రమేష్, సెక్షన్ ఆఫీసర్ నాగరాజు, బీట్ ఆఫీసర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా పత్రాల తయారీపై అవగాహన

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ ఉన్నత విద్యలో ప్రవేశ పరీక్షల పత్రాల తయారీపై శనివారం వ్యవసాయ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి, రాజేంద్రనగర్ కళాశాలలో బోధిస్తున్న గిరిష్మ ఉన్నత చదువులు, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల తయారీపై వివరించారు. నాబార్డు, ఆర్‌బీఐ, ఎఫ్‌సీఐ, సీసీఐ వంటి జాతీయ సంస్థల ప్రవేశ పరీక్షల తయారీకి కావాల్సిన అంశాలు, మూక్ పరీక్షల సమాచారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ఎస్సీ, ఎస్టీ సెల్, జేఆర్ఎఫ్ సెల్ (సోషియల్ సైన్సెస్) విభాగం సంయుక్తంగా చేపట్టగా డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, కోటేశ్వర్, డాక్టర్ శిరీష, డాక్టర్ శ్రావణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా లారీలు నిలిపితే కేసులే..



మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరు టౌన్: ఇసుక, బొగ్గు లారీలు రోడ్లపై నిలిపి ట్రాఫిక్‌కు, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇసుక రైజింగ్, 14, 12 టైర్ల అసోసియేషన్, కోల్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇసుక లారీలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్లు, టీఎస్ఎండీసీ అధికారులను ఆదేశించారు. లారీలు వెళ్లే మార్గంలో రోడ్లపై వాటరింగ్ చేస్తూ ప్రజలకు అసౌర్యం కలగకుండా వాలంటీర్లను నియమించాలని సూచించారు. రోడ్లపై నిలిపి ఉంచిన లారీలను సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, సింగరేణి నుంచి బీటీపీఎస్‌కు వెళ్లే లారీలు బీటీపీఎస్ అధికారులతో సమన్వయం చేసుకుని రోడ్లపై నిలిపే అంశాన్ని పూర్తిగా నివారించాలన్నారు. ఈ సమావేశంలో బీటీపీఎస్ అసిస్టెంట్ కమాండెంట్ తిరుపతి, ఇన్‌చార్జి సీఐ వెంకటేశ్వర్లు, మణుగూరు ఎస్సై మేడ ప్రసాద్, టీఎస్ఎండీసీ సిబ్బంది, కోల్ ట్రాన్స్‌పోర్ట్ లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శివనాయక్

దుమ్ముగూడెం: విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన ఉండాలని భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ ఆథారిటీ చైర్మన్ వి.శివ నాయక్ సూచించారు. శనివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు, మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉచిత న్యాయ సాయం అందించడమే లీగల్ సర్వీసెస్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం మెడికల్ క్యాంపులో రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందచేశారు. డాక్టర్ పుల్లారెడ్డి, డాక్టర్ రుక్మారెడ్డి, సీఐ అశోక్, భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట దేవదానం, న్యాయవాదులు రావి రామ్మోహన్ రావు, వెంకటేశ్వర్లు, నాగరాజు, తిరుమలరావు, సాధనపల్లి సతీష్, యు.గౌతమ్, పులుసు తరుణి, కొత్త మల్లేష్, సురేష్, రమేష్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

దమ్మపేట : రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య, వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం దమ్మపేట ప్రధాన సెంటర్‌లో రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, మాస్‌లైన్ పార్టీ అనుబంధ అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ... నూతన వ్యవసాయ మార్కెట్ విధానాలను రద్దుచేసి, సోమనాథ్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూముల విషయంలో ఆదివాసీలపై పెట్టిన కేసులను ఉపసంహరించుకొని, భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బుర్రా వెంకన్న, నాయకులు చంద్ర అరుణ, భిక్షం, కూకలకుంట రవి, రాము, నాయిని రాజు, ప్రభాకర్, కిషోర్, కల్పన పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

భక్తుల కోసం మరుగుదొడ్ల నిర్మాణాలు



పనులను ప్రారంభిస్తున్న అడిషనల్ డీఆర్డీఓ రవి

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలో శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద భక్తుల సౌకర్యానికి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టుతున్నట్లు అడిషనల్ డీఆర్డీఓ నల్లబోతుల రవి అన్నారు. ఈ మేరకు శనివారం ఆలయం వద్ద రూ.3 లక్షల వ్యయంతో నిర్మించే మరుగుదొడ్ల నిర్మాణాల పనులను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఉపాధి హామి పథకం కింద వీటిని మంజూరు చేశామని, త్వరలోనే నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. అనంతరం నారంవారిగూడెం పంచాయతీలో రూ.60 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసే ప్లాస్టిక్ మేనేజ్మెంట్ యూనిట్ కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సరాల శ్రీనివాసరావు, పీఆర్ ఏఈఈ అక్షిత, ఏపీఓ రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఉద్యోగాలకు ప్రత్యేక చట్టం చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఉద్యోగాలకు ప్రత్యేక చట్టం చేయాలని ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయ బాబు డిమాండ్ చేశారు. శనివారం ఆదివాసీ టీచర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృత్యంతర శిక్షణ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న గ్రేడ్–2 భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ ప్రక్రియకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసం ఆదినారాయణ, పూనెం రమేష్, నాయకులు సవలం వీరాస్వామి, కొర్స చిట్టిబాబు, సోందె రత్నాకర్, పూనెం దేవి, హిందులత, వరలక్ష్మి దేవి, పార్వతి, కల్లూరి భద్రయ్య, మట్ట వెంకటేశ్వర్లు, సత్యప్రసాద్, బాలరాజు, వట్టం శ్రీనివాసరావు, కొర్స రాజేష్, పూనెం వీరభద్రం, సోడి రాంబాబు, కాంతారావు, వినోద్ బాబు పాల్గొన్నారు.

పొలాలే గ్రౌండ్లు.. గట్లే బౌండరీలు..

- మైదానాలు లేక పొలాల్లోనే ఆటలు
- అనువైన స్థలం లేక యువతకు తప్పని తిప్పలు
- మినీ స్టేడియం నిర్మించాలని వేడుకోలు



పొలాల్లో క్రికెట్ ఆడుతున్న యువత

పినపాక: పొలం గట్లే బౌండరీ లైన్లుగా.. పొలాల క్రీడా మైదానాలుగా అన్నట్లుగా మండలంలో యువత క్రీడలు ఆడుతున్నారు. సరైన మైదానం లేక యువత ఆటలకు ఎటు వెళ్లాలో తెలియక ఫోన్లకు, ఇళ్లల్లో టీవీలకు పరిమితమవుతున్నారు.

కోతలు అయిపోవడంతో..

వేసవికాలం కావడంతో పంట పొలాలు కోతలు అయిపోవడంతో చాలా గ్రామాల్లో పొలాలే క్రీడా మైదానాలుగా ఉపయోగించుకుంటున్నారు. పొలం గట్లనే బౌండరీలుగా మార్చుకొని యువత క్రికెట్ ఆడుతున్నారు. ప్రతి గ్రామంలో చిన్న పిల్లవాడి నుండి పెద్దవాళ్ల వరకు ప్రతీ ఒక్కరు క్రికెట్ ఆడటానికి ఇష్టపడతారు. అలాంటి క్రికెట్‌కు ఎక్కువ మైదానం కావాలి. అలాంటి మైదానం ఎక్కడా లేకపోవడంతో ఆటలకు వేసవికాలంలో పొలాలే మైదానాలుగా వాడుతున్నారు. తదుపరి వ్యవసాయ పనులు ప్రారంభించిన తర్వాత యువత గ్రౌండ్ లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలో మినీస్టేడియాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

మినీ స్టేడియం నిర్మించాలి



మండలంలో మినీ స్టేడియం నిర్మించి ప్రత్యేక యువతకు అన్ని ఆటలకు సంబంధించి శిక్షణ ఇవ్వాలి. అధికారులు దీనిపై దృష్టి పెట్టి అనువైన స్థలాన్ని గుర్తించి అన్ని ఆటలు అక్కడే ఉండే విధంగా స్టేడియం నిర్మించాలి.

– గంగిరెడ్డి సతీష్ రెడ్డి, బయ్యారం

అనువైన స్థలాన్ని గుర్తించాలి



మండలంలో ప్రభుత్వం కేటాయించిన క్రీడా ప్రాంగణాలు క్రికెట్ కు సరిపోదు. అధికారులు స్పందించి క్రికెట్‌కు అనువైన స్థలాన్ని గుర్తించి స్టేడియం నిర్మించాలి

– జగదీష్, గార్ల బయ్యారం